## క్లుప్తంగా

### కూలిన మట్టి మిద్దె



కర్నూలు(రూరల్): గత పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని గార్గేయపురం కోట వీధిలో షాకిర్ అనే వ్యక్తికి చెందిన మట్టి మిద్దె కూలిపోగా ప్రమాదం తప్పింది. వివరాలు.. గ్రామానికి చెందిన షాకిర్ కుటుంబసభ్యులు ఐదుగురు మంగళవారం రాత్రి భోజనం ముగించి ఇంట్లో నిద్రిస్తుండగా పక్క గది దూలాలతో సహా మట్టి మిద్దె కుప్ప కూలింది. ఆ గదిలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

### పక్వానికి వచ్చాకే ఉల్లి కోతలు చేపట్టాలి

కర్నూలు(రూరల్): మండల పరిధిలో ఆయా గ్రామాల్లో 15-20 రోజుల్లో ఉల్లి కోతలు మొదలవుతున్నందున కర్నూలు మండల వ్యవసాయ అధికారి రూఫస్ రోనాల్డ్ బుధవారం ఉల్చాల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు . ఆయన మాట్లాడుతూ.. ఉల్లి పంట 110-120 రోజుల వ్యవధిలో పక్వానికి వస్తుందని చెప్పారు. ముందుగానే కోస్తే ఉల్లిగడ్డల నిల్వ సామర్థ్యం తగ్గుతుందన్నారు. కోత తరువాత ఉల్లిని బాగా ఆరబెట్టడం వల్ల దిగుబడులు నాణ్యతగా ఉంటాయని వివరించారు. రైతులు మార్కెట్ ధరలు గమనించి విక్రయాలు జరిపితే మంచి లాభాలు పొందవచ్చన్నారు. అలాగే ఉల్లి కోత సమయంలో పు చ్చులు, పురుగులు తక్కువగా వచ్చేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సచించారు. ఏఈఓ మోహన్ రెడ్డి, గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్జీఎం అధ్యాపకులకు అభినందన

పాణ్యం: ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాల్లో ఆర్జీఎం అధ్యాపకులు చోటు దక్కించుకున్నట్లు చెర్మన్ శాంతిరాముడు అన్నారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ అమెరికాకు చెందిన ప్రముఖ స్టాన్‌ఫోర్డ్ యునివర్సిటీ ఏటా ప్రపంచంలోని శాస్త్రవేత్తల్లో కొంతమందిని అత్యంత ప్రతిభా శాస్త్రవేత్తలుగా గుర్తిస్తుందన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి స్టాన్‌ఫోర్డ్ విడుదల చేసిన శాస్త్రవేత్తల జాబితాలో తమ కళాశాలకు చెందిన డాక్టర్ పి. సుదర్శన్‌రెడ్డి మెకానికల్ ఇంజినీరింగ్ ట్రాన్స్‌ఫోర్ట్ విభాగంలో 1062వ ర్యాంక్, డాక్టర్ ఉపేంద్ర రజాక్ ఎనర్జీ విభాగంలో 2977వ ర్యాంక్, డాక్టర్ బీజీ జమాలయ్య అప్లెడ్ ఫిజిక్స్ విభాగంలో 6,376 ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ అధ్యాపకులకు ఆర్జీఎం చెర్మన్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, డీన్ రామిరెడ్డి పాల్గొన్నారు.

### మన డబ్బులు - మన లెక్కలపై అవగాహన

పాణ్యం: పాణ్యంలోని పొదుపు కార్యాలయంలో 14 మండలాలకు చెందిన అకౌంట్ సిబ్బందికి బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. గ్రామ సంఘాలకు సంబంధించిన అన్ని రకాల ఆర్థిక లావాదేవీలు ప్రతి నెల తప్పకుండా ఆన్‌లైన్, సీబీఐ అకౌంట్‌లో నమోదు చేయాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మన డబ్బులు- మన లెక్కలు కార్యక్రమంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు తీసుకున్నటువంటి అప్పులు, లావాదేవీలు పూర్తిగా పారదర్శకంగా ఉండాలన్నారు. ఈవిషయాన్ని గ్రామస్థాయిలో ప్రతి సభ్యురాలికి తెలియజేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా డీపీఎంఐబీ హనుమంతనాయక్, ఏపీ ప్రసాద్, ఐబీ ఏపీఎం పుణ్యవతి పాల్గొన్నారు.

### పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సాహకాలు

పాణ్యం: మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు పీఎంఈజీపీ పథకం ఎంతో ఉపయోగపడుతందని, దీనిని మహిళలు ఉపయో గించుకోవాలని డ్వామా పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నా రు. బుధవారం పాణ్యం పొదుపు కార్యాలయ ంలో మహిళలలతో సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వారికి ప్రోత్సాహకాలు అందిస్తే వ్యాపారవేత్తలుగా రాణిస్తారన్నారు. ఆసక్తి గల మహిళలు ఉత్తమ పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు పీఎంఈజీపీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసాద్, పరిశ్రమశాఖ జీఎం మహబూబ్‌బాషా, ఐపీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఓర్వకల్లు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. బుధవారం కర్నూలు-కడప జాతీయ రహదారిపై గల నన్నూరు టోల్ ప్లాజా అధికారులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలందరు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం జాతీయ రహదారి పక్కన మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టు హెడ్ మధన్‌మోహన్, హైవే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కోడుమూరులో అన్నపూర్ణదేవిగా కాళికాదేవి



అన్నపూర్ణదేవి అలంకరణలో నాగలాపురం సుంకులా పరమేశ్వరి



అన్నపూర్ణదేవి రూపంలో వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి



అన్నపూర్ణ దేవి అలంకరణలో పార్వతీ దేవి



ఇ.తాండ్రపాడులో దుర్గమ్మ



గార్గేయపురం బీసీ కాలనీలో దుర్గమ్మ



అన్నపూర్ణ దేవిగా వెంకాయపల్లె ఎల్లమ్మ



నిడ్జూరులో అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ

# అన్నపూర్ణ దేవీ పాహిమాం



లొద్దిపల్లెలో అన్నపూర్ణ దేవి అలంకరణలో..



నన్నూరులో అమ్మవారు



హుసేనాపురంలో కొలువైన దుర్గామాత



సి.బెళగల్‌లో కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు



గాయత్రీదేవి అలంకరణలో వాసవీ మాత



అన్నపూర్ణదేవిగా అమ్మవారు



ఆలమూరులో కూరగాయల అలంకరణలో..

కోడుమూరు రూరల్: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని వల్లెలాంబదేవి, కన్యకాపరమేశ్వరీ, చౌడేశ్వరీ దేవి, కాళికామాత, రాములమ్మ, తులజా భవాని, అంబా భవాని అమ్మవారు అన్నపూర్ణ దేవిగా దర్శనమివ్వడంతో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించారు. వల్లెలాంబదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు, పల్లకీ సేవ నిర్వహించారు. క్రిష్ణాపురం సర్పంచ్ శ్రీనివాస రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పూజలో పాల్గొనడంతో పాటు భక్తులకు అన్నదానం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- గూడూరు మండలంలో అమ్మవారి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అలాగే కె.నాగలాపురం గ్రామంలో వెలసిన సుంకులా పరమేశ్వరీ అన్నపూర్ణ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

సి.బెళగల్: మండల కేంద్రంలో 3వ రోజు అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఈశ్వర ఆలయంలో కొలువైన అమ్మవారికి బుధవారం అష్టోత్తరజపం, సహస్ర నామార్చన, పారాయణం, పంచామృత అభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. కోమటి వీధిలో వెలసిన కన్యకా పరమేశ్వరి దేవిని, బస్టాండ్‌లో పార్వతి దేవిని అన్నపూర్ణ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

కర్నూలు(రూరల్): మండలంలో బుధవారం దుర్గమ్మ అన్నపూర్ణాదేవి రూపంలో దర్శనమిచ్చారు. అలాగే నిడ్జూరు, మునగాలపాడు పరిధిలోని తుంగభద్ర నది ఒడ్డున మామిడితోటలో వెలసిన దుర్గమ్మను అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిమ్మకాయల దండలు, బంతిపూల మాలలు సమర్పించారు.

- నగర శివారులో వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మను అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో విద్యుత్ దీపాలతో సుదరంగా అలంకరించారు. అమ్మవారు ఒక చేతిలో అక్షయపాత్ర, మరో చేతిలో గరిట పట్టుకొని దివ్యదర్శనం చేశారు.
- గార్గేయపురం బీసీ కాలనీలో ప్రతిష్ఠించిన దర్గమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.
- ఇ.తాండ్రపాడు బీసీ కాలనీ సుంకులమ్మ గుడి ప్రాగణంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మకు భక్తులు పూజలు చేశారు.

గడివేముల: గడివేములలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గాయత్రీదేవి కుంకుమార్చన, సుహాసిని పూజ, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొంతల మధుసూదన్ గుప్తా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాణ్యం: శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మండలంలో అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలతో పాటు అమ్మ వారిని వివిధ రూపాల్లో అలంకరిస్తున్నారు. భక్తులు టెంకాయలు, పూలు, పండ్లు, గాజులు, నూతన వస్త్రాలు అందించి మొక్కులు తీర్చుకుంటున్నారు. పాణ్యంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని పార్వతిదేవిగా, హైందవశక్తి ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాన్ని అన్నపూర్ణదేవిగా, కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా, ఆలమూరులో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు, లొద్దిపల్లె, హుసేనాపురం గ్రామాల్లో కొలువుదీరిన అమ్మవార్లకు భక్తులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. లొద్దిపల్లెలో ప్రధాన రహదారిపై కొలువుదీరిన దుర్గాదేవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడం విశేషం. నన్నూరు గ్రామంలో స్థానిక మారెమ్మ గుడి వద్ద కొలువుంచిన దుర్గాదేవికి బాలభక్తుడు పూజలు నిర్వహించడం చూపరులను అబ్బుర పరిచింది. హుసేనాపురంలో జాతీయ రహదారి పక్కన కొలుదీరిన అమ్మవారికి భక్తులు విశిష్ట పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

## సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి

కల్లూరు: పంటలలో రైతులు సస్య రక్షణ పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి పి.ఎల్. వరలక్ష్మి అన్నారు. బుధవారం కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు పంట నమోదు చేసుకోవాలన్నారు. అధిక వర్షాల కారణంగా నష్టపోతున్న ఉల్లి రైతులు త్వరితంగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఉల్లి పంటను పూర్తిగా కోత దశకు వచ్చే వరకు పంట కోత చేయరాదని సూచించారు. పత్తి పంటలో కాయకుళ్లు తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నానో యూరియా ఉపయోగాలు తెలియజేశారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, కర్నూలు ఏడీఏ శ్రీవర్ధన్‌రెడ్డి, డీఆర్‌సీ ఏఓ రంగారెడ్డి, కల్లూరు మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

గడివేముల: మండల పరిధిలోని కొరటమద్ది గ్రామానికి చెందిన ఓ మహిళ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. ఎస్‌ఐ నాగార్జున రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వేల్పుల బాల వెంకమ్మ (60) కొన్ని రోజుల నుంచి వివిధ రోగాలతో ఇబ్బంది పడుతుండేది. ఈనెల 14వ తేదీన ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ కోలుకోలేక బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈమేరకు కుమారుడు పెద్ద రాముడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

## అంతర పంటలతో లాభాలు



బ్రాహ్మణదొడ్డిలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రైతులు అంతర పంటలపై దృష్టి సారించాలని, తద్వారా అధిక లాభాలు పొందవచ్చని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. ఆయన బుధవారం మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి, కంది పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులతో సహావేశం నిర్వహించి వ్యవసాయ సలహాలు, సూచనలు చేశారు. పత్తి, వేరుశనగలో అంతర పంటగా కంది సాగు చేస్తే లాభసాటిగా ఉంటుందని, అలాగే ప్రధాన పంటకు రక్షణగా ఉంటుందని తెలియజేశారు. అదేవిధంగా పత్తి పంటలో గులాబీరంగు పురుగు నివారణకు ఎకరాకు 10 చొప్పున లింగాకర్షక బుట్టలను, పసుపు, తెలుపు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని, సామూహికంగా పురుగులను ఆకట్టుకునేందుకు ఎకరాకు 20 లింగాకర్షక బుట్టలు పత్తి పొలంలో ఉంచాలని ఆయన సూచించారు. అలాగే రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకుని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఈఓ శిరీష, ఎంపీఈఓ వెంకటేష్, భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యమే లక్ష్యం



మాట్లాడుతున్న వైద్యాధికారి నాగరాజు

కోడుమూరు రూరల్: మహిళలంతా ఆరోగ్యంగా జీవించాలన్నదే స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమ లక్ష్యమని కోడుమూరు సీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజు అన్నారు. బుధవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సీహెచ్‌సీలో మెగా వైద్య శిబిరం నిర్వహించి మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి, ఆహారం వల్ల రక్తపోటు, షుగర్, గుండెకు సంబంధించిన వ్యాధులు, క్యాన్సర్ వంటి భయానక జబ్బులు మనుషులకు వస్తున్నాయని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆయా కుటుంబాలు బాగుంటాయని, మహిళలు ఆరోగ్యంగా జీవించేందుకు కృషి చేయాలని డాక్టర్ శ్రీమంత్‌మాదన్న సూచించారు. వైద్య శిబిరంలో 266 మంది మహిళలు పాల్గొని వివిధ రకాల చికిత్సలు చేయించుకున్నారు. అనంతరం సీహెచ్‌సీలో రక్తదాన శిబిరాన్ని నిర్వహింగా, 20 మంది దాతలు పాల్గొని రక్తదానం చేశారు. ఆయా విభాగాలకు సంబంధించిన వైద్యులు, సిబ్బంది, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలి



గృహ లబ్ధిదారులకు నోటీసులు ఇస్తున్న హౌసింగ్ ఏఈ బాలయ్య

కర్నూలు(రూరల్): ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద అర్హులైన లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని కర్నూలు మండల ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ పి.బాలయ్య సూచించారు. ఆయన బుధవారం మండల పరిధిలోని గోందిపర్ల, దేవమాడ గ్రామాల్లో లబ్ధిదారులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ, ఆర్థిక సాయాన్ని నవంబర్‌లోపు వినియోగించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన 1040 ఇళ్లు నిర్మాణాలు జరుగుతుండగా దాదాపు 60 శాతం మంది నిర్మాణం పూర్తిచేసుకున్నట్లు చెప్పారు. మిగతా వారు ఇళ్ల నిర్మాణం ఆలస్యం చేస్తే సబ్సిడీ నిలిపివేసి, ఆర్‌ఆర్ చట్టం ప్రకారం ప్రభుత్వ అందించిన ఆర్థిక సాయాన్ని రికవరీ చేస్తామని హెచ్చరించారు. వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు క్రాంతికుమార్, సాయికీర్తన ఉన్నారు.

### పీ-4 సర్వే పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాణెమ్మ

సి.బెళగల్: ఉద్యోగులు గ్రామాల్లో చేపట్టే పీ-4 సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ రాణెమ్మ సూచించారు. బుధవారం సి.బెళగల్‌లోని స్త్రీశక్తి భవన్‌లో మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల ఉద్యోగులకు పీ-4 సర్వే నిర్వహణపై శిక్షణ కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇదివరకు చేపట్టిన పీ-4 సర్వే కొన్ని మార్పులతో చేపట్టాల్సి ఉందన్నారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శుల వంటి అంశాలపై సర్వేలో వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం సర్వే ఎస్‌ఓపీ అమలు అంశాలపై ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, ఏఎస్‌ఓ ఆదినారాయణ, మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

### కొర్రపోలూరులో డెంగీ కేసు ?

గడివేముల: మండల పరిధిలోని కొర్రపోలూరు గ్రామంలో ఓ అనుమానిత డెంగీ కేసు నమోదైనట్లు నంద్యాల జిల్లా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆ గ్రామానికి చెందిన రిషిత్‌కు డెంగీ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అతను నివసించే ఇంటితోపాటు చుట్టుపక్కల ఇళ్లు, పరిసరాల్లో దోమల నివారణ మందు స్ప్రే చేయించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మనోహర్, ఏఎన్‌ఎం మరియమ్మ, సీహెచ్‌ఓ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేతలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



కోడుమూరుకు చేరుకున్న చేనేత అధ్యయన యాత్ర

కోడుమూరు రూరల్: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవ స్వామి విమర్శించారు. చేనేత సమస్యల పరిష్కారంలో భాగంగా చేపట్టిన చేనేత అధ్యయన యాత్ర బుధవారం కోడుమూరు చేరుకుంది. ఈ సందర్భంగా మాధవస్వామి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాల వల్లే చేనేత కార్మికుల పరిస్థితి దినదిన గండంగా మారిపోయిందన్నారు. ప్రభుత్వాల హామీలు మాటలకే పరిమితమయ్యాయని, ఆచరణలో అమలు కావడం లేదని విమర్శించారు. చేనేత రంగాన్ని రక్షించుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేనేతలంతా ఐక్యమై పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి, సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు, బాలాజీ మాట్లాడుతూ.. చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రిబేటు, యారన్ సబ్సిడీ, మార్కెటింగ్ ఇన్సెంటివ్ బకాయిలు రూ.127 కోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మగ్గం నేసే ప్రతి కార్మికుడికి నేతన్న భరోసా పథకం కింద ఏడాదికి రూ.36 వేలు చెల్లించాలని, చేనేత సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, జౌళిశాఖ నుంచి చేనేతను వేరు చేసి చేనేత పరిశ్రమను రక్షించాలని, చేనేతలకు సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని కోరారు చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహబూబ్‌బాషా, శ్రీరాములు, సీపీఐ మండల కార్యదర్శి రాజు, నాయకులు చిన్న రాముడు, మధు తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లి మద్దతు ధర రూ.2 వేలకు పెంచాలి



ఉల్లి రైతుల సమస్యలను తెలుసుకుంటున్న అగ్రివాచ్ కమిటీ సభ్యులు ముస్లీహుదీన్

కోడుమూరు రూరల్: ఉల్లి ఎగుమతులకు అనుమతి కల్పిస్తూ మద్దతు ధర రూ.2 వేలకు పెంచాలని రైతులు కోరారు. ఏపీ ప్రభుత్వం ఉల్లి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన అగ్రివాచ్ కమిటీ సభ్యులు ముస్లీహుదీన్ బుధవారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉల్లి సాగు చేసిన పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఉల్లి రైతులు మాట్లాడుతూ.. పెరిగిన కూలీ రేట్లు, ఎరువులు, మందుల దృష్ట్యా ఎకరా ఉల్లి పంట సాగుకు రూ.80 వేల నుంచి రూ.90 వేల వరకు ఖర్చు వస్తోందని, ప్రస్తుతం గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ఉల్లి క్వింటాల్‌కు ప్రభుత్వం రూ.2 వేల మద్దతు ధర చెల్లిస్తే తమకు కనీసం పెట్టిన పెట్టుబడులైనా దక్కుతాయని రైతులు వాపోయారు. అగ్రివాచ్ కమిటీ సభ్యులు ముస్లీహుదీన్ మాట్లాడుతూ.. రైతులు చెప్పిన సమస్యలన్నింటిని నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. కోడుమూరు హార్టికల్చర్ ఆఫీసర్ మదన్‌మోహన్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కలుషిత నీరు సరఫరా



కోడుమూరులో రంగు మారిన కుళాయి నీరు

కోడుమూరు రూరల్: హంద్రీ నదికి గాజులదిన్నె నీటి విడుదలతో కోడుమూరు పట్టణంలోని కాలనీలకు నీటిని సరఫరా చేసే మంచినీటి బోర్లు మునిగిపోయాయి. దీంతో గత రెండు, మూడు రోజుల నుంచి కొన్ని కాలనీలకు హంద్రీలో పారే నీటినే సిబ్బంది విడుదల చేస్తుండడంతో కొళాయిలకు కలుషితమైన నీరు వస్తున్నాయి. కనీసం గృహ అవసరాలకు వాడుకునేందుకు కూడా వీలులేని విధంగా నీరు కలుషితమై వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం వల్లెలాంబ గుడి లైన్ ట్యాంకు నుంచి కోడుమూరులోని కోటవీధి కొళాయిలకు విడుదలైన నీరు మురుగునీటిని తలపించింది. బురదమయంగా ఉన్న నీటిని పట్టుకుని ఎలా తాగాలని, కనీసం గృహ అవసరాలకు వాడుకునేందుకు కూడా పనికిరావంటూ ప్రజలు వాపోయారు. కలుషిత నీటిని పట్టుకోలేక అలాగే వదిలేశారు.

**నీటి కష్టాలను పట్టించుకోని ప్రభుత్వం**

కోడుమూరు పట్టణ ప్రజల నీటి కష్టాలను పట్టించుకోవడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అధికారం చేపట్టిన ఏడాదికే కోడుమూరుకు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ వేయించి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్న ప్రజాప్రతినిధుల హామీలు మాటలకే పరిమితమయ్యాయంటూ ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు. పాలన చేపట్టి 16 నెలలు అవుతున్నా జీడీపీ నుంచి కోడుమూరుకు మంచినీటి పైపులైన్ నిర్మాణం కేవలం ప్రతిపాదనలకే పరిమితమైంది. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి కోడుమూరుకు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.